క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ప్రొద్దుటూరు : స్థానిక తొగటవీరక్షత్రియ ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సేవా సంఘం ప్రొద్దుటూరు అధ్యక్షుడిగా ఈడెం లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కుండా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా గంగారపు రాధాకృష్ణమూర్తి, కోశాధికారిగా ఉమ్మడిశెట్టి నందగోపాల్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, గౌరవ సలహాదారులు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈడెం లక్ష్మీనారాయణ వరుసగా మూడో మారు సేవా సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2016లో ఈ సంస్థలను ఏర్పాటు చేశారు.

పుస్తక పఠనంతోనే ఉజ్వల భవిష్యత్తు



బహుమతులు అందజేస్తున్న దాదాపీర్

పోరుమామిళ్ల : పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ తెలిపారు. ఆదివారం గ్రంథాలయంలో లైబ్రేరియన్ అఫ్రిది ఆధ్వర్యంలో విద్యార్థులకు కథలు, వేమన పద్యాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సెలవు రోజుల్లో గ్రంథాలయానికి వచ్చి పుస్తకపఠనం అలవర్చుకోవాలన్నారు. గెలుపొందిన విద్యార్థులు రషీద, హసీన, స్వర్ణలకు బహుమతులు పొందారు.

అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ



దుప్పటి కప్పుతున్న రామకృష్ణారెడ్డి దంపతులు

పోరుమామిళ్ల : దుకాణాల ముందు, బస్టాండులో, గుడుల ముందు రాత్రిళ్లు నిద్రిస్తున్న అనాధలు, అభాగ్యులకు, యాచకులకు వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, రామతులసి దుప్పట్లు పంపిణీ చేశారు. శనివారం రాత్రి వారు సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, జయరాంలతో కలసి పట్టణంలో తిరిగి చలికి వణుకుతూ నిద్రపోతున్న అభాగ్యులకు దుప్పట్లు కప్పారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చలికాలంలో రాత్రిళ్లు ఇబ్బందులు పడుతున్న అనాధలకు దాతల సహకారంతో దుప్పట్లు అందిస్తున్నామన్నారు.

రేపు 'వై ఏపీ నీడ్స్ జగన్'

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురవలూరు, సోమాపురం గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లక్షుమయ్య తెలిపారు. గ్రామ సచివాలయాల వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డు ఆవిష్కరించి, గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి, గ్రామ వలంటీర్లకు మా నమ్మకం నువ్వే జగన్ మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు.

ఘనంగా వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుజాతమ్మ

అట్లూరు : వికసిత్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుజాతమ్మ తెలిపారు. మండల పరిధిలోని కుంభగిరి, తంబళ్ళగొంది పంచాయతీ పరిధిలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. గ్రామంలోని విలేజ్ క్లీనిక్ వద్ద ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామ పరిధిలోని ప్రజలందరికీ వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనుల పండువగా జ్వాలాతోరణం



ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రత్యేక పూల అలంకరణలో ముక్తిరామలింగేశ్వరస్వామి



ప్రొద్దుటూరు కల్చరల్ : గాజుల అలంకరణలో రాజరాజేశ్వరిదేవి



ప్రొద్దుటూరు కల్చరల్ : ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు కల్చరల్ : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ప్రొద్దుటూరు పట్టణంలోని అగస్త్యేశ్వర స్వామి, రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి, పెన్నాతీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం జ్వాలాతోరణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ చంద్రుడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి పూలమాలతో, రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని గాజులతో, కాశీ అన్నపూర్ణాదేవి సమేత హనుమత్ లింగేశ్వరస్వామిని శోభాయమానంగా అలంకరించారు. సాయంత్రం మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ పండితులు జ్వాలాతోరణం వెలిగించారు. జ్వాలా తోరణం నుంచి వచ్చిన భస్మాన్ని భక్తులు నుదుట ధరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి మంగళవాయిద్యాలతో ముక్తిరామలింగేశ్వర్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పల్లేటి శకంర్‌రెడ్డి, ఆలయ ఈఓ బీవీ నరసయ్య, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వెల్లాలలో వైభవంగా..

రాజుపాళెం : మండల పరిధి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో జ్వాలా తోరణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయంలో వెయ్యి దీపాలను వెలిగించారు. ఈఓ బీవీ నరసయ్య, ఆలయ మాజీ చైర్మన్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, భక్తులు స్వాములను దర్శించుకొని పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్తీక పౌర్ణమి రోజున స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని అర్చకుడు వెంకటాచలపతి తెలిపారు.

శివాలయాల్లో భక్తుల సందడి

మండల పరిధి వివిధ గ్రామాల్లోని శివాలయం, సోమేశ్వర, భీమలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. రాత్రి వేళల్లో ఆలయంలో, ధ్వజ స్తంభాల వద్ద మహిళలు 365 దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం స్వాములకు కాయాకర్పూరం సమర్పించి స్వాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

అల్లాడుపల్లెలో..

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో ఆదివారం సాయంత్రం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ జి.కిషోర్ కుమార్ రెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి వేడుకలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో అధిక సంఖ్యలో పాల్గొన మహిళలు దీపాలు వెలిగించి కార్తీక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసి జ్వాలా తోరణాన్ని భక్తి శ్రద్ధలతో చేపట్టారు. జ్వాలా తోరణం తర్వాత వీరభద్రస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో జ్వాలాతోరణం వెలిగిస్తున్న భక్తులు



రాజుపాళెం: వెల్లాల భీమలింగేశ్వరస్వామి ఆలయంలో జ్వాలా తోరణంలో అర్చకులు



చాపాడు: అల్లాడుపల్లెలో వీరభద్రస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కోటి దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

అట్లూరు : మండలంలోని కమలకూరు శివాలయ ఆవరణలో కార్తీక పౌర్ణమి సందర్భంగా గ్రామస్తులు కోటి కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని మహిళలు లక్ష వత్తులను తయారు చేసుకుని దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.

భక్తిశ్రద్ధలతో..



మృత్యుంజయాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

బద్వేలు అర్బన్ : కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆదివారం స్థానిక తెలుగుగంగ కాలనీలోని అనంతగిరి క్షేత్రం ఆవరణలో గల మృత్యుంజయాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో నిర్వహించిన లక్ష దీపోత్సవం సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక దీపాలతో ఆలయంలో వెలుగులు నిండాయి.

గడువులోపు అధిక పెన్షన్ ఇవ్వాలి



అసోసియేషన్‌లో చేరిన వారితో ఎంప్లాయిస్ నాయకులు

మైదుకూరు : ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు అధిక పెన్షన్ ఇవ్వాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనిటీ అసోసియేషన్ కడప జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కేకే కుమార్, ఎస్ఆర్ శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం మైదుకూరు డిపోలో ఎంప్లాయిస్ యూనిటీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని అసోసియేషన్ డిపో అధ్యక్షుడు ఎం.నారాయణ అధ్యక్షత నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కుమార్, శేఖర్ మాట్లాడుతూ అన్ని చోట్ల క్యాడర్ స్ట్రెంగ్త్ సమస వలన ఉద్యోగులకు ఇబ్బందులు ఉన్నాయన్నారు. సుమారు 16 నెలల కాలంగా రిమూవల్ అప్పీల్స్‌పైన ఇప్పటి వరకూ ఎలాంటి ఆదేశాలు రాలేదని, ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధిక పెన్షన్‌పై సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు (తీర్పు) అమలులో భాగంగా ఆర్టీసీ మేనేజ్‌మెంట్ జారీ చేసిన సర్క్యులర్‌లోని అంశాలను అమలు చేయాలని కోరారు. అధిక పెన్షన్ ఇవ్వడం వలన ఉద్యోగికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జోనల్ కమిటీ సభ్యుడు పీఎస్‌పీ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.బోసుబాబు, రామమూర్తి, డిపో కార్యదర్శి టీపీ మునెయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి ఏవీ శివరాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇతర యూనియన్ల నుండి 12 మంది ఉద్యోగులు ఎంప్లాయిస్ యూనిటీ అసోసియేషన్‌లో చేరగా వారిని డిపో కమిటీ నాయకులు ఆహ్వానించారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా

ప్రొద్దుటూరు : బొల్లవరం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని 13వ వార్డు కౌన్సిలర్ ఎస్.ఇర్ఫాన్ బాషా తెలిపారు. లబ్ధిదారులతో కలసి ఆదివారం జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లను ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్ ఇళ్లు సక్రమంగా కట్టడం లేదని కొంత మంది లబ్ధిదారులు చెప్పగా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తానని కౌన్సిలర్ తెలిపారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం నాటికి ఇళ్లు పూర్తి చేస్తే లబ్ధిదారులు కూడా సంతోషిస్తారన్నారు. ప్రతిపక్షపార్టీలు ఈ కాలనీని సందర్శిస్తే ప్రభుత్వం ఎంత వేగంగా ఇళ్లు నిర్మిస్తుందో అర్థమవుతుందన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

మైదుకూరు : కార్మిక చట్టాలను, ప్రభుత్వ రంగాలను రక్షించాలని, రైతుల నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27, 28వ తేదీల్లో విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ, ఏఐటీయూసీ, రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మైదుకూరులో జరిగిన సమావేశంలో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ ప్రభుత్వంపై భారాన్ని మోపుతోందని ఆరోపించారు. కార్మికులకు అండగా ఉంటే చట్టాలను మార్చి వారి జీవితాలను రోడ్డుపాలు చేశారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను చౌకగా కార్పొరేట్ కంపెనీలకు విక్రయిస్తున్నారని ధ్వజమెత్తారు. రైతు సంఘాల సమన్వయ వేదిక, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ మహాధర్నా నిర్వహిస్తున్నారని వారు పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ, దాని అనుబంధ సంఘాల నాయకులు భాస్కర్, శ్రీరాములు, ఏవీ శివరాం, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో శాకాహార ర్యాలీ

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పలు వీధుల్లో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ధ్యానులు, శాకాహారులు, సంస్థ ప్రతినిధులు ఐటీఐ సర్కిల్ నుంచి సమీపంలోని వీధుల్లో ఈ ర్యాలీ చేపట్టారు. శాకాహారం శ్రేష్టమైనదని, అమృతాహారమని నినాదాలు చేశారు. ప్లకార్డులు, బ్యానర్లు చేతబూని, ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ర్యాలీలో పిరమిడ్ సొసైటీ అధ్యక్షులు జీవీఎస్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఊర్మిళాదేవి, సీనియర్ మాస్టర్లు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రగతితో పాటు అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో రామాంజనేయనగర్, వెంగమాంబనగర్, సుమిత్రా నగర్‌లలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను ప్రజలకు అందజేసి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోవిడ్ కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాల్లో ఎక్కడా కోత విధించకుండా ప్రతి కుటుంబానికి అండగా నిలిచారన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గౌస్‌బాషా(బాబ్జీ), ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నారాయణ, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు రాజేష్ ప్రభుకుమార్

బద్వేలు అర్బన్ : స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఆదివారం జరిగిన పంచాయతీ రాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం సమావేశంలో నియోజకవర్గ స్థాయి నూతన కమిటీని ఎన్నుకున్నారు.

సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్ ప్రభుకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా షేక్ ఆరిఫ్, ఉపాధ్యక్షుడిగా ఎన్.విద్యాసాగర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.సునీత, కార్యదర్శిగా సి.వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా జీవన్‌తేజ, కోశాధికారిగా పి.చంద్రశేఖర్, కో ఆప్షన్ మెంబర్‌గా చెన్నమ్మలను ఎన్నుకున్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల పంచాయతీరాజ్ నాల్గవ తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ద్వారానే స్వేచ్ఛ, సమానత్వం

ప్రొద్దుటూరు : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే దేశ ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం లభించాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 74 ఏళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారానే హక్కులు, విధులు సంభవించాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు సుధాకర్, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పిట్టా బాలాజీ, సత్యం, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- ఏపీ దళిత సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక మైదుకూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏపీ దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లె యల్లయ్య మాదిగ, జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరతోపాటు మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.
- స్థానిక బీసీ సమాఖ్య కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణయ్య యాదవ్, నియోజకవర్గ నాయకులు పాణ్యం సుబ్బరాయుడు, సుబ్బరామయ్య, కాలే దేవానంద్, దస్తగిరయ్య యాదవ్, వెంకటేష్‌యాదవ్, ప్రతాప్, బాల పెద్దయ్య, ఆంజనేయులు, మల్లికార్జున, గంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



బద్వేలు అర్బన్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి

బద్వేలు అర్బన్ : రాజ్యాంగ ఫలాలు అయిన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక నెల్లూరు రోడ్డు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు నేడు తల ఎత్తుకుని బతికేలా రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌కు దేశమంతా రుణపడి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లాబకాష్, యద్దారెడ్డి, కేశవరెడ్డి, మౌలాలి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్ నారాయణ, దళిత నాయకులు కేశవయ్య, డాక్టర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక చైతన్య సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.వి.చంద్రశేఖర్, సంఘమిత్ర సొసైటీ అధ్యక్షుడు సొద్దలపెంచలయ్య, సీపీఐ రాష్ట్ర నాయకులు ఎస్.వెంకటసుబ్బయ్య, సీనియర్ దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హెచ్.వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, యాదవ ఉద్యోగ సంఘం జిల్లా నాయకులు రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తి, విలువలు కాపాడుకుందాం

పోరుమామిళ్ల : రాజ్యాంగ స్ఫూర్తిని, విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ తెలిపారు. 74వ రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా పోరుమామిళ్లలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏబీఓ కరుణాకర్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వీరయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఫారెస్టు కార్యాలయంలో రేంజర్ వెంకటరమణారెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్స్ రమణ, రమణయ్య, బీటు ఆఫీసర్లు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళి

బ్రహ్మంగారిమఠం : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బ్రహ్మంగారి మఠంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఎంపీపీ మట్లాడుతూ భారత రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం చాలా గొప్పవిషయం అన్నారు. కార్యక్రమంలో జోగయ్య, థామస్, సుబ్బరాజు,పుల్లయ్య, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మంగారిమఠం: అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎంపీపీ, నాయకులు



కలసపాడు : అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

కలసపాడు : రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ సమాన హక్కులు, సమాన అవకాశాలు అనే సిద్ధాంతంతో మన రాజ్యాంగం రూపుదిద్దుకుందని అన్నారు. అంబేడ్కర్ 125వ జయంతి సందర్భంగా 2015లో కేంద్ర ప్రభుత్వం నవంబర్ 26న రాజ్యాంగ అవతరణ దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.